# లవ్ ఎట్ ఫస్ట్ సైట్

టాక్సీ వేగంగా పోతున్నది.

మంద్రంగా పాటలు వినిపిస్తున్నాయి – స్టీరియోలోంచి.

ముందు సీటులో కూర్చున్న యువకుడు మ్యూజిక్‌కు అనుగుణంగా తలూపుతున్నాడు. మధ్య మధ్య చిటికలు వేస్తున్నాడు.

సునంద పక్కన ఆమె తల్లిదండ్రులు.

శ్రీశైలం నుండి వెనక్కి వస్తున్నారు. మల్లన్న దర్శనం బాగా జరిగింది. కానీ, బస్సులు లేవు – సాయంత్రం దాకా వేచి వుండాలి. అందుకని షేర్డు టాక్సీ మాట్లాడుకొని బయలుదేరారు మార్కాపురం.

"నందా! కూల్‌డ్రింక్ తాగుతావా!" అడిగాడు ప్రమోద్.

"వద్దు నాన్న! నాకు నిద్రొస్తున్నది."

వాళ్ళిద్దరూ కూడా కూల్‌డ్రింక్ షాపు దగ్గరికి వెళ్లారు.

సునంద పాటలు వింటూ పడుకుంది సీటుకానుకొని.

"ఎక్స్క్యూజ్‌మి! నా పేరు హరిప్రసాద్! హరి అంటే చాలు – మీకేమైనా కావాలా!" అడిగాడు ముందు యువకుడు లోపలికి వంగి.

"నో థ్యాంక్స్! మా అమ్మానాన్న ఉన్నారు. కావాలంటే తెస్తారు. మీకేం అవసరం?" కోపంగా అడిగింది.

"ఐ లవ్ యూ – ఇదిగోండి నా విజిటింగ్ కార్డు – రేపు ఫోన్ చెయ్యండి ఒంగోలుకు. ఉదయం 7.30కి ఉంటాను." చెప్పాడు కార్డు అందిస్తూ.

సునంద ఒక్కక్షణం అతని కళ్ళలో చూసి – అతని కార్డు అందుకుంది.

"నేను బిజినెస్ చేస్తూ వుంటాను. బిజినెస్ పనిమీద అన్ని ఊళ్ళూ టూర్ చేస్తూవుంటాను. మీ ఊరు కూడా చాలాసార్లు వచ్చాను."

"అయితే...?"

"మీరు నాకెందుకో చాలా నచ్చారు" అన్నాడు.

"బి ఇన్ యువర్ లిమిట్స్ – మా నాన్నగారు వాళ్ళు వస్తున్నారు" కసిరింది సునంద.

ప్రమోద్ బిస్కట్లు, అరటిపండ్లు కొనుక్కొని వచ్చాడు. బిస్కట్లు అందరికీ పంచాడు. అరటిపళ్ళు కూడా తలా రెండు ఇచ్చాడు.

టాక్సీ బయలుదేరింది. చల్లటిగాలికి నిద్రముంచుకొచ్చింది.

మార్కాపురం చేరింది టాక్సీ - నిద్రలేచారు. టాక్సీలోంచి దిగబోయారు.

"సార్! మీ పేరు...." హరి.

"ప్రమోద్!"

"ఏం చేస్తూ వుంటారు."

చెప్పాడు.

"నైస్ జర్నీ - నే బిజినెస్ మీద వస్తూనే వుంటాను - వచ్చినప్పుడు కలుస్తాను. మీ అమ్మాయి కదూ!"

"యస్. ఇంజనీరింగ్ చేస్తున్నది." చెప్పాడు.

"ఓ నైస్! సీ యూ ఎగైన్!"

వాళ్ళు చూడకుండా హరి సునందకు కన్నుగొట్టాడు.

సునందకు విస్మయం కలిగింది అతని తెగువకు. మరుసటి రోజుదయం పబ్లిక్ ఫోన్ దగ్గరికి వెళ్ళింది సునంద. ఎనిమిది కావొస్తున్నది. నెంబర్ డయల్ చేసింది.

"నేను నందను - హరిప్రసాదేనా మాట్లాడుతున్నది?" నంద అడిగింది.

"హాయ్! నీ ఫోన్ కోసం అరగంట నుంచి ఎదురుచూస్తున్నా!"

"ఫోన్ చేస్తానని ఎందుకనుకున్నావు?'

"అదేంటి నందా - ఒక అబ్బాయికి ఒకమ్మాయి ఎందుకు చేస్తుంది?"

"మనం ఎవరమని చెయ్యాలి?"

"హలో! నిన్న మనం ప్రయాణం చేశాం గుర్తులేదా?"

"సరే! నన్ను ఎందుకు ఫోన్ చెయ్యమన్నావు?"

"నీ గొంతు వినాలని... నీ గొంతులోని తియ్యదనాన్ని ఆస్వాదించాలని."

"అంతేనా...?"

"నీ అందం నన్ను పిచ్చివాడ్ని చేస్తున్నది - ఐ లవ్ యూ!"

"షటప్! హరీ! ఇలా ఎంతమంది ఆడపిల్లలతో ఆడుకుంటావు. ఓ రెండు గంటలు కల్సి ప్రయాణం చేసినంత మాత్రాన నన్ను ప్రేమిస్తున్నావా? నా గురించి నీకేం తెల్సు? నాలో ఏం చూశావు - దేనికి ప్రేమిస్తున్నావు?"

"లవ్ ఎట్ ఫస్ట్ సైట్!" తడబడుతూ అన్నాడు.

"చూడు మిష్టర్! నువ్వు నీ జాబ్‌లో భాగంగా సంవత్సరానికి రెండొందల రోజులు ప్రయాణం చేస్తూ వుంటే - కనీసం రోజుకొకళ్ళు చొప్పున సంవత్సరానికి రెండొందలమంది ఆడపిల్లలు కన్పిస్తారు. నువ్వు ఇంకా ఇరవై సంవత్సరాలు యాక్టివ్‌గా ఉండగలవనుకున్నా,

ఎనిమిది వేల మంది అమ్మాయిలు కన్పిస్తారు. వీళ్ళందరినీ ప్రేమిస్తావా? నువ్వేమైనా శ్రీకృష్ణుడివా ఎనిమిది వేల మందిని పెళ్ళి చేసుకోవడానికి?"

"నో...నో... అలాకాదు.. జస్ట్ నిన్ను చూస్తేనే అలా అన్పించింది."

"ఫూల్ నీ మాటలకి బోల్తా కొట్టడానికి ఇక్కడెవరూ సిద్ధంగా లేరు. నేను కాలేజీలో చేరి మూడేళ్ళయింది. ఈ మూడేళ్ళలో నీలాంటి వెధవల్ని వెయ్యిమందిని చూశాను. ఇంకోసారి ఇటువైపు వచ్చినా - మా నాన్నతో మాట్లాడినా నీకు పోలీసులతో సత్కారం చేయిస్తాను."

"నందా! జోక్‌గా అంటున్నావా! నేను నిన్ను ప్రేమిస్తున్నాను."

"యూ ఫూల్! ఐ యామ్ డామ్ సీరియస్! ఎప్పుడూ ఇలా ఆడపిల్ల వెంటపడకు. ఈ ప్రేమలు నమ్మడానికి ఈ కాలం ఆడపిల్లలు అమాయకులు కారు. ఏ ప్రేమలో ఏది వుందో మాకు తెల్సు - బీకేర్ ఫుల్!" దులిపేసి ఫోన్ పెట్టేసింది నంద.

( ఆంధ్రభూమి 17-8-2000 )